AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

## టీమిండియా మీదే ఎక్కువ ఒత్తిడి: దక్షిణాఫ్రికా కోచ్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా సూపర్ 8 పోరులో భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఆదివారం తలపడనున్నాయి. దీనికి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదిక కానుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు సఫారీల కోచ్ షుక్రి కాన్రాడ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. 'భారత్ మీదే అధిక ఒత్తిడి ఉంటుంది. సెమీ ఫైనల్స్ చేరుకొనే విషయంలో వారిపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వారు ఫైనల్‌కు కూడా చేరుకుంటారు. అయితే ఒత్తిడిలో వారు బలహీనపడతారు. నిజానికి మా ఇరుజట్ల మీదా ఒత్తిడి ఉంటుంది' అని షుక్రి అన్నాడు.

## సుప్రీంకోర్టు తీర్పుపై ట్రంప్ ఆగ్రహం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా సుప్రీంకోర్టు తీర్పుపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులపై విదేశీ శక్తుల ఒత్తిడి ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ట్రంప్ పలు దేశాలపై సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దానిపై విచారణ చేపట్టిన కోర్టు ప్రపంచంలోని పలు దేశాలపై విధించిన సుంకాలు చెల్లవని స్పష్టం చేసింది. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు చట్టవిరుద్ధమని పేర్కొంది. ఇది అధ్యక్షుడు తన అధికార పరిధిని దాటినట్లే అని సుప్రీం కోర్టు చెప్పుకొచ్చింది. దీంతో ట్రంప్ న్యాయమూర్తులపై మండిపడ్డారు.



## చెత్త ఇచ్చి.. నిత్యావసరాలు తీసుకోండి..



**అక్షరటుడే, ఏపీ:** చెత్త ఇచ్చి.. నిత్యావసరాలు తీసుకోండని ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా వినుకొండలో స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక స్వచ్ఛరథం ఉంటుందని తెలిపారు. పాత వస్తువులు ఇస్తే.. అందుకు బదులుగా నిత్యావసరాలు ఇస్తారని చెప్పారు.

## కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెప్పడం తథ్యం




**అక్షరటుడే, హైదరాబాద్:** "ఏఐ సమ్మిట్" కార్యక్రమంలోకి చొరబడి, దేశ పరువుకు భంగం వాటిల్లేలా యువజన కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం సిగ్గుచేటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాహుల్ గాంధీ ఆదేశాలతో కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన వెకిలి వేషాలను దేశమంతా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం తథ్యమన్నారు.

## 'దేవ్ జీ, రాజిరెడ్డి లొంగిపోతారు..'



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మావోయిస్టు మాజీ నేత మల్లోజుల వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ అగ్ర నేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి జనజీవన స్రవంతిలోకి వస్తారని చెప్పారు. మిగతా వారు కూడా లొంగిపోతారని చెప్పారు. ప్రస్తుతం మావోయిస్ట్ ఉద్యమానికి మనుగడ లేదని మల్లోజుల తెలిపారు. పార్టీలో ఉన్న వాళ్లంతా వృద్ధులు అయిపోయారన్నారు.



## కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. రూ.వందల కోట్ల విలువైన భూములను కబ్జా చెరల నుంచి విడిపిస్తోంది. తాజాగా నగరంలోని కొండాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. రాజరాజేశ్వరి కాలనీలో ప్రజా సౌకర్యాల కోసం ఉద్దేశించిన కమ్యూనిటీ భూమిని కొందరు ఆక్రమించారు. ఈ మేరకు స్థానికులు హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. కొండాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 78/93లో దాదాపు 7 ఎకరాల భూమిని ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. ఆ భూమి విలువ రూ.700 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తెల్లవారుజామున ఆ భూమిలో ఆక్రమణలను తొలగించారు.

## ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయం ముందు బీజేపీ నిరసన

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఢిల్లీలో ఏఐ సమ్మిట్ ప్రాంగణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసనకు వ్యతిరేకంగా.. నేడు బీజేపీ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నివాసం ముట్టడికి బీజేపీ నేతలు యత్నించారు. భారీ సంఖ్యలో నాయకులు చేరుకుని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశ ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆందోళనలతో అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.



దేశంలోని పలుచోట్ల పేలుళ్లకు ఉగ్రవాదులు ప్రణాళిక రచించారు. లష్కరే తోయిబా సంస్థ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఢిల్లీ, హైదరాబాద్‌లో అటాక్స్‌కు ప్లాన్ చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఓ ఉగ్రవాది జైలు నుంచే పేలుళ్లకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు వచ్చాయి. వరుస పేలుళ్లకు కుట్ర చేశారని పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# ఉగ్ర కుట్ర..

■ హైదరాబాద్‌లో పేలుళ్లకు ప్లాన్ ■ ముగ్గురు నిందితుల అరెస్ట్ ■ ఢిల్లీలోనూ భారీ స్కెచ్

దేశవ్యాప్తంగా లష్కరే తోయిబా సంస్థ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు హెచ్చరించిన విషయం తెలిసిందే. దీంతో ఢిల్లీలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సైతం విధ్వంసానికి పథకం రచించినట్లు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. జైలు నుంచే ప్రణాళికలు సాగినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు భావిస్తున్నారు.

### నిఘా పెంపు

నగరంలోని మూసారాంబాగ్, సైదాబాద్, మలక్‌పేట్ ప్రాంతాల పై పోలీసుల నిఘా పెంచారు. చంచల్‌గూడ జైలు నుంచే ఉగ్రకుట్రకు ప్లాన్ చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వరుస పేలుళ్లకు కుట్ర చేశారని ముగ్గురు నిందితులు అరెస్ట్ చేశారు. జైలులో ఉన్న సదరు ఉగ్రవాదిని కలవడానికి వచ్చిన వారిపై సైతం ప్రత్యేక నిఘా పెట్టారు. ములాఖత్‌కు వచ్చిన వారితో దాడుల గురించి మాట్లాడినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు నగర వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉగ్రదాడికి కుట్ర పన్నారనే వార్తలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లో..

పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఢిల్లీ ఎర్రకోట సమీపంలో, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయంతో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రముఖ మత ప్రదేశాలలో పేలుడుకు ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్రవాద సంస్థ అధునాతన పేలుడు పరికరాలతో దాడికి కుట్ర పన్నుతున్నట్లు సమాచారం.

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు.. కేటీఆర్ ఆగ్రహం



**అక్షరటుడే, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏఐ సదస్సు నిర్వహించిన విషయం తెలిసిందే. ఢిల్లీలో జరిగిన ఈ సదస్సుల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. అంతర్జాతీయ సదస్సుల్లో యువజన కాంగ్రెస్ నాయకులు వేదిక వద్దకు చేరుకొని అర్ధనగ్నంగా ఆందోళన చేశారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై దేశవ్యాప్తంగా ప్రజలు, నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన చేయడానికి అనేక వేదికలు ఉన్నాయని, అంతర్జాతీయ సదసులో దేశ పరువు తీసేలా వ్యవహరించారని మండిపడుతున్నారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం స్పందించారు. యువజన కాంగ్రెస్ సభ్యులు ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026ను చిన్న రాజకీయ నాటకాలకు వేదికగా ఎంచుకోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. నిరసనల కోసం ఇంతటి ప్రపంచ వేదికను ఉపయోగించడం భారతదేశాన్ని అంతర్జాతీయంగా తక్కువ అంచనా వేస్తారని పేర్కొన్నారు.

## కామారెడ్డిలో ఉద్రిక్తత



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి, కాంగ్రెస్ నేతలు వివిధ అంశాలపై చర్చకు రావాలని సవాళ్లు విసురుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌తో పాటు కాలేజీ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే కాంగ్రెస్ నేత మహేందర్‌రెడ్డి పోలీసుల కళ్లుగప్పి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. షబ్బీర్ అలీకి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టారు.

## అయేషా మీరా హత్య కేసు క్లోజ్ చేసిన కోర్టు



**అక్షరటుడే, ఏపీ:** ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అయేషా మీరా హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆధారాలు లేవని కోర్టు కేసును మూసి వేసింది. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఉమెన్స్ హాస్టల్‌లో 2007లో అయేషా దారుణ హత్యకు గురైంది. పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో సత్యంబాబును నిందితుడని పోలీసులు పేర్కొనగా కోర్టు జైలు శిక్ష విధించింది. 2017లో హైకోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించింది. కేసులో అసలు నిందితులను పట్టుకోవాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ అధికారులు అయేషా మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. అయితే కేసులో ఆధారాలు లభించలేదని సీబీఐ పేర్కొంది. దీంతో ఈ కేసును మూసి వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

## ఆ పరిస్థితులే ఇప్పుడు సహాయపడ్డాయి..



**'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' మూవీతో తొలిసారి తెరపై కనిపించింది సంజయ్ కపూర్ కుమార్తె శనయా కపూర్. అంతకుముందే 'బేధడక్'తో వెండితెరపై అడుగుపెట్టాల్సిన ఆమె.. కొన్ని కారణాలతో తొలి చిత్రం వాయిదా పడింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ.. మొదటి ప్రాజెక్టు ఆగిపోవడం గురించి పలు విషయాలు వెల్లడించింది. అది తనపై ఎలాంటి ప్రభావం చూపలేదని అంటోంది. ప్రతీదీ ఒక కారణం వల్లే జరుగుతుందని.. ఇప్పుడు నేను వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ అనుభవం నాకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆ పరిస్థితులే ఈ రోజు నన్ను నటిగా తీర్చిదిద్దుకోవడంలో సహాయపడ్డాయని చెప్పుకొచ్చింది.**

—అక్షరటుడే, సినిమాడెస్క్

## మైక్రోసాఫ్ట్ గేమింగ్ సీఈవోగా ఆశా శర్మ



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారత సంతతి టెకీ ఆశా శర్మ కొత్త సీఈవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న ఫిల్ స్పెన్సర్ పదవీవిరమణ చేశారు. దీంతో ఈ స్థానంలో గేమింగ్ డివిజన్‌కు సీఈవో, వైస్ ప్రెసిడెంట్‌గా ఆశా శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ వంటి సవాళ్లను ఆమె ఎదుర్కోనున్నారు. మైక్రోసాఫ్ట్‌లో చేరడానికి ముందు ఆశా శర్మ పలు అతిపెద్ద అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలలో ఉన్నత పదవుల్లో పని చేశారు. గేమింగ్ సీఈవోగా బాధ్యతలు చేపట్టడానికి ముందు మైక్రోసాఫ్ట్‌లోని కృత్రిమ మేధ విభాగంలో సీనియర్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

## గద్వాల జిల్లాలో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, జోగులాంబ గద్వాల:** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని పరమేశ్వర ఇండస్ట్రీస్ డ్రిప్ ఇరిగేషన్ ఫ్యాక్టరీలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ప్లాస్టిక్ పరిశ్రమ కావడంతో ఫైర్ ఇంజిన్ వచ్చే సరికి సామగ్రి కాలిబూడిద అయింది. అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.